విజ్ఞాన యాత్రలతో విద్యావికాసం

రాజానగరం: విద్యార్థులు తరగతి గదుల్లో నిత్యం నేర్చుకునే విజ్ఞానాన్ని మరింతగా పెంపొందించడంతో పాటు అవసరమైన నైపుణ్యాలను ఆకళింపు చేసుకునేందుకు విజ్ఞాన యాత్రలు ఎంతో ఉపయోగపడతాయి. విద్య పరిశీలన, ప్రయోగాత్మకం (ప్రాక్టికల్), పరిశోధనలు చేసేందుకు వీలుగా తోటి విద్యార్థులతో కలిసి ముఖ్యమైన క్షేత్రాలను సందర్శించడం వలన గ్రూప్ డిస్కషన్ చేసేందుకు, కొత్త విషయాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా వాస్తవికతతో ఆలోచించేందుకు, తగిన లక్ష్యాలను ఎంచుకునేందుకు కూడా ఈ పర్యటనలు తోడ్పడతాయి. విజ్ఞాన యాత్రలకు ఎక్కువగా పరిశ్రమలు, ప్రకృతి కేంద్రాలు, వినోద ఉద్యానవనాలు, సైన్స్ మ్యూజియాలు, పురాతన, చారిత్రిక కట్టడాలు మున్నగు వాటిని ఎంపిక చేస్తుంటారు. ఈ ప్రాంతాలను సందర్శించడం వలన విజ్ఞాన వికాసం పాటు గ్రూప్ డిస్కషన్స్, ప్రాజెక్టులు/వర్క్‌షాప్‌లు తయారీకి, షార్ట్ ఫిల్మ్ మేకింగ్ మున్నగు వాటి అవకాశం ఉంటుందంటున్నారు అధ్యాపకులు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో విద్యనభ్యశిస్తున్న బీఈడీ, ఎంపీఈడీ విద్యార్థులు మంగళవారం విజ్ఞానయాత్రకు వెళ్లారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చేపట్టిన ఈ యాత్ర ద్వారా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ, మ్యూజియం, రాళ్లబండ మ్యూజియం, రాజమహేంద్రవరంలోని కందుకూరి పురమందిరం, ఆయన నివసించిన గృహం, దామెర్ల ఆర్ట్ గ్యాలరీ తదితర కొన్ని చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రాధాన్యత, ప్రత్యేకతలను విద్యార్థులకు వెంట ఉన్న అధ్యాపకులు వివరించారు.



ధవళేశ్వరంలోని కాటన్ మ్యూజియం వద్ద బీఈడీ, ఎంపీఈడీ విద్యార్థులు

విద్యార్థులకు ఉపయోగపడేలా..



విద్యార్థులకు ఏఏ ప్రదేశాలను చూపించాలి, వాటి వల్ల విద్యాపరంగా కలిగే ప్రయోజనాలు ఏమిటనే విషయాలను బాగా పరిశీలించి, అందుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేస్తాం. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) సూచనల మేరకు ఈ కార్యక్రమాలను చేపడుతుంటాం. – డాక్టర్ కె. సుబ్బారావు, ప్రిన్సిపాల్, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, నన్నయ వర్సిటీ క్యాంపస్

ఇంటర్ పరీక్షల్లో అధిక ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థులకు ఒత్తిడిని అధిగమించడంపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

రంగంపేట: ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి అధిక ఉత్తీర్ణత సాధించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పరీక్షల్లో మానసిక ఒత్తిడి ఎలా అధిగమించాలి అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా ప్రతి సబ్జెక్టును దృష్టిలో ఉంచుకుని చక్కటి ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. శారీరక, మానసిక సంసిద్ధతతో ధ్యానం చేయడం, మంచి ఆహారం తీసుకోవడం, తెల్లవారుజామునే నిద్రలేవడం మేలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి.రేవతిలక్ష్మి, జి.బాలయోగేశ్వరి పాల్గొన్నారు.

ఈ-పంట నమోదును సక్రమంగా నిర్వహించాలి

- వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ బొప్పన ప్రసాద్

గోకవరం: రబీలో ఈ-పంట నమోదును సక్రమంగా నిర్వహించాలని గుంటూరు వ్యవసాయ కమిషనర్ కార్యాలయం అడిషనల్ డైరెక్టర్ బొప్పన ప్రసాద్ అన్నారు. సూదికొండ గ్రామంలో జరుగుతున్న రబీ ఈ పంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రామకృష్ణా గార్డెన్స్‌ను ఆయన సందర్శించి రైతు కొరిపల్లి అప్పల స్వామిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఏడీఏ బి.మల్లికార్జునరావు, ఏఓ రాజరాజేశ్వరి, వీఏఏలు పాల్గొన్నారు.


ఈ-పంట నమోదును పర్యవేక్షిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ప్రణాళిక ప్రకారం చదివితే అద్భుత విజయాలు

- డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్రహ్మణ్యం


రంగంపేట హైస్కూల్లో విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రిన్సిపాల్ రామసుబ్రహ్మణ్యం

రంగంపేట: విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే అద్భుత విజయాలు సాధించొచ్చని బొమ్మూరు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ నూజిల్ల రామసుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం వి.పార్థసారథి అధ్యక్షతన జరిగిన పరీక్షా పర్వ అంశంపై జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరీక్షలు పూర్తయ్యేవరకూ టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. తక్కువ మార్కులు వచ్చే సబ్జెక్టులపై అవగాహన పెంచుకుని ఎక్కువ మార్కులు సాధించడానికి కృషి చేయాలన్నారు. ఎస్‌పీసీఆర్ సౌజన్యంతో జిల్లా వ్యాప్తంగా 10 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా చెప్పారు. అనంతరం ఆయన విద్యార్థులకు పెన్నులు బహూకరించి పరీక్షల్లో విజేతలు కావాలని ఆశీర్వదించారు. సమావేశంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు పి.చంద్రశేఖర్, వీసీ జాకబ్, ఎన్. వెంకటలక్ష్మి, సీఆర్పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు


సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలు డాక్టర్‌కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు

గోకవరం: పుట్టుకతోనే మూగ, వినికిడి లోపంతో బాధపడుతున్న గోకవరానికి చెందిన బాలుడు వెలిశెట్టి చక్రపాణి వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైందని గోకవరం వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు తెలిపారు. బాలుడి వైద్యానికి స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సహకారంతో రూ.5.35 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైందన్నారు. దీనికి సంబంధించిన పత్రాలను మంగళవారం గుంటూరులోని బాలుడికి వైద్యం చేయడానికి ముందుకు వచ్చిన ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడిని కలిసి అందించడం జరిగిందన్నారు. బాలుడి వైద్యానికి సహకరించిన సీఎంకు, ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా ఆయనతో పాటు బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి కళ్యాణోత్సవాలు

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరు కొండపైన కొలువైన భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి 22 వరకూ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు తరలి రావాలని కోరారు.

ఈపంట నమోదు లాభదాయకం

మధురపూడి: ఈపంట నమోదు రైతులకు లాభదాయకమని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయానికి చెందిన అదనపు డైరెక్టర్ బి.ప్రసాద్ అన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం దోసకాయలపల్లి, తదితర గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి మరింత అవగాహన కలిగించారు. ఆశాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు, ఏడీ బీకే మల్లికార్జునరావు, ఏఓ గౌరీదేవి పాల్గొన్నారు.

నేడు సమన్వయ సమావేశం

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాల నిర్వహణ కోసం బుధవారం సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్టు అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యులు తాడి రజనీరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. నరసన్న కల్యాణోత్సవాలు మార్చి 2 నుంచి 8 వరకు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాల ఏర్పాట్ల విషయమై జరిగే ఈ సమావేశానికి అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహిస్తారని, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

బహిరంగ వేలం

తీర్థంలో కొబ్బరి ముక్కలు తీసుకోవడానికి, తలనీలాలు పోగుచేసుకోవడానికి, భక్తుల జోళ్ల భద్రపరిచే జోళ్లస్టాండ్ లైసెన్స్ తదితర వాటికోసం బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు.

కల్వరి చర్చి ప్రారంభం


ఎంపీ భరత్‌రామ్‌కు బైబిల్ అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: ప్రజలందరూ ఆనందోత్సాహాలతో ఉండాలని, అందుకు దేవుని కృప ప్రతి ఒక్కరిపైనా ఉండాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆకాంక్షించారు. కొండగుంటూరులో నూతనంగా నిర్మించిన వాయిస్ ఆఫ్ కల్వరి చర్చిని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీకి నిర్వాహకులు బైబిల్‌ను బహూకరించారు. కార్యక్రమంలో పాస్టర్ జాన్‌వెస్లీ, వైఎస్సార్ సీపీ నగర శాఖ అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, సోమన శ్రీను, లల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

అమర వీరులకు అశ్రునివాళి


అమరులైన సైనికుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాల ఆవరణలో దేశం కోసం అమరులైన సైనికుల త్యాగాన్ని కొనియాడారు. 2019లో ఫిబ్రవరి 14వ తేదీన జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా వద్ద జరిగిన ఆత్మాహుతి దాడిలో వీరమరణం పొందిన 40 మంది సైనికుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొవ్వూరి అమ్మిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే శాంతి, అహింస అలవరచుకోవాలని సూచించారు. మెళ్లూరు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బీవీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో అమరులైన సైనికులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు మంగళవారం రాత్రి విద్యార్థులు, యువత నివాళులర్పించారు. ప్రభుత్వ హైస్కూల్ నుంచి సీతానగరం బస్టాండ్ సెంటర్, నాలుగు బొమ్మల సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

హాస్యనటుడు రాజబాబుకు నివాళి


పూలమాల వేస్తున్న దృశ్యం

మధురపూడి: హాస్యనటుడు రాజబాబు వర్ధంతిని మంగళవారం కోరుకొండలో వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లిడి చంటిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అత్తిలి శ్రీరామచంద్రమూర్తి స్కూల్లోని రాజబాబు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఉపసర్పంచ్ నేతుల చిన్ని, వైఎస్సార్ సీపీ నాయకులు బొండాడ చందు, మల్లిడి చంటి రెడ్డి, కోడూరి సత్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో చక్కని ఆరోగ్యం

బిక్కవోలు: సైక్లింగ్‌తో చక్కని ఆరోగ్యం సాధ్యమవుతుందని బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాదేవి అన్నారు. మంగళవారం బిక్కవోలు పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కొంకుదురు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పందలపాక, కొమరిపాలెం, కొంకుదురు, తొస్సిపూడి గ్రామంలో విద్యార్థులకు సైక్లింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొంకుదురు పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం వల్ల గంటకు 450 నుంచి 750 కేలరీలు ఖర్చవుతాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

గోకవరం: ప్రతి రోజు సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని గోకవరం ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావుదొర అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గోకవరంలో సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి విద్యార్థులు సైకిళ్లతో దేవీచౌక్ వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సైక్లింగ్ చేయడం ద్వారా కలిగే లాభాల గురించి సీహెచ్ఓ మేరీకృప, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, హెచ్‌ఎం చిమ్మరాజుదొర, హెచ్‌ఈ శైలజ, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కండి.. ఆరోగ్యంగా జీవించండి

రంగంపేట: రోజూ సైకిల్ తొక్కితే ఆరోగ్యవంతులుగా తయారవుతారని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు డి.లావణ్య అన్నారు. మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్‌మేళా జరిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది యోగా చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సైకిల్ తొక్కడం వల్ల బరువు తగ్గడం, ఒత్తిడి తగ్గడం, మంచి నిద్ర పట్టడంతో పాటు గుండె జబ్బులు రాకుండా ఉంటాయని డాక్టర్ లావణ్య సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శంకర్, పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కొంకుదురులో సైక్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..


బిశ్వభూషణ్ హరిచందన్‌ను కలిసిన కేవీవీ సత్యనారాయణ తదితరులు

రాజానగరం: ఛత్తీస్‌గఢ్‌కు గవర్నర్‌గా బదిలీపై వెళ్తున్న బిశ్వభూషన్ హరిచందన్‌ను చైతన్య విద్యాసంస్థల ప్రతినిధులు కేవీవీ సత్యనారాయణరాజు, శశికిరణ్‌వర్మ, ఒడిశా బీజేపీ ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ హరిచందన్, టీటీడీ బోర్డు మెంబర్ దుష్యంత్ మంగళవారం రాజభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహార కిట్లు అందిస్తున్న జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి

బిక్కవోలు: పౌష్టికాహారంతో వ్యాధులు దూరమవుతాయని జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని కొంకుదురు పీహెచ్‌సీ పరిధిలో టీబీ రోగులకు గ్రాసిం ఇండ్రస్టీస్ ద్వారా అందించే పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి, సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

17న మెగా వైద్య శిబిరం

అనపర్తి: మండలంలోని రామవరంలో సబ్బెళ్ల సురేష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి ఆధ్వర్యంలో ఈ నెల 17న మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తనయుడు సబ్బెళ్ల సురేష్‌రెడ్డి 24వ జయంతి సందర్భంగా గ్రామంలోని కల్యాణ మండపంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో అనపర్తి రమాదేవి ఆసుపత్రికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రమాదేవి, ఈఎన్‌టీ వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రియారమేష్, సాధారణ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ కృష్ణారావులు పాల్గొని వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని రామవరం, సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ నిర్వాహకులు కోరారు.

భారీ అన్న సమారాధన

అనపర్తి: మండలంలోని పులుగుర్తలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల పాటు కన్నుల పండువగా జరిగాయి. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భారీఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు ఆరు వేల మంది హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ చైర్మన్ తాడి గణపతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ


పందలపాకలో నిర్వహిస్తున్న గ్రామోత్సవం

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో భూదేవి అమ్మవారిని చాకటిపేట కమ్యూనిటీ హాలు నుంచి తీన్‌మార్ డప్పులు, మేళతాళాలతో వివిధ వేషధారణలతో గ్రామోత్సవం చేశారు. అనంతరం గౌరీశంకర ఆలయం వద్ద ఉన్న రేవులో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మార్చి 21 వరకు ఎలక్షన్ కోడ్

సీతానగరం: మార్చి 21 వరకూ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున ఏవైనా కార్యక్రమాలు చేయాలంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఎన్నిక ఉన్నందున మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలులో ఉందన్నారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు జరపకూడదన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించాలంటే తప్పని సరిగా కలెక్టర్ అనుమతులు ఉండాలన్నారు. గ్రామాల్లో ఉన్న విగ్రహాలకు ముసుగులు వేస్తామన్నారు. మండల గ్రామాల్లో టీమ్‌లు ఏర్పాటు చేశామని, ఎలక్షన్ కోడ్‌ను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు చంద్రబాబు పర్యటన

గోకవరం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం జగ్గంపేట నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయంలో బయలుదేరి గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి మీదుగా గోకవరం చేరుకుని ఠాణా సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తారు. అనంతరం కొత్తపల్లి మీదుగా జగ్గంపేట చేరుకుంటారు. జగ్గంపేటలో ఎన్టీఆర్ విగ్రహం ప్రారంభించి బహిరంగ సభలో పాల్గొంటారు.

ఘనంగా గావు గంగమ్మ ఆలయ వార్షికోత్సవం


గావు గంగమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న సత్తి వంశీకులు

అనపర్తి: స్థానిక పాతవూరిలో ఉన్న గావు గంగమ్మ అమ్మవారి ఆలయ 11వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సత్తి వంశీకులు శతాబ్దాలుగా గంగమ్మ తల్లిని తమ ఆరాధ్యదైవంగా కొలుస్తున్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా అలంకరించారు. సత్తి వంశీకులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మూడేళ్లకోసారి నిర్వహించే గావు గంగమ్మ సంబరాన్ని ఈ నెల 26, 27 తేదీల్లో అనపర్తిలో, 28న అనపర్తి శివారు కొత్తూరులో జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.